
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 3 మెదక్
జిల్లాల వార్తలు
మంగళవారం 5 నవంబరు 2024





సంగమేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న మహిళలు



సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని సంగమేశ్వరాలయంలో..

శైవక్షేత్రాలు దేదీప్యమానం

కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా సంగారెడ్డి జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రసిద్ధ క్షేత్రమైన ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వరాలయానికి జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణలో మహిళలు దీపాలను వెలిగించి సంగమేశ్వరుడిని వేడుకున్నారు. సంగారెడ్డిలోని శివాజీనగర్, సోమేశ్వరవాడలోని శైవక్షేత్రాల్లో భక్తులు ఉదయం 5 గంటల నుంచే స్వామి వారి దర్శనానికి తరలివచ్చారు. శివలింగానికి అభిషేకాన్ని నిర్వహించారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని సంగమేశ్వరాలయంలో సాయంత్రం మహిళలు, యువతులు జ్యోతులను వెలిగించగా ఆలయం దేదీప్యమానంగా వెలుగులీనింది.

- ఝరాసంగం/సంగారెడ్డి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి)



ఝరాసంగం కేతకీ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

40 నార్కోటిక్ డ్రగ్స్ కిట్ల పంపిణీ

- లాలాజలం, మూత్రంతో డ్రగ్ టెస్టింగ్
- పాజిటివ్ వస్తే కటకటాల్లోకే
- మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



డ్రగ్స్‌కిట్ పనితీరును వివరిస్తున్న ఎస్పీ

మెదక్ అర్బన్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వాడకాన్ని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పోలీస్‌స్టేషన్లకు 40 నార్కోటిక్ డ్రగ్స్ కిట్లను పంపిణీ చేశామని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం కిట్లను పంపిణీ చేసిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అధికారులు, సిబ్బంది వాహనాలు తనిఖీ చేసే సమయంలో అనుమానం ఉన్న వ్యక్తులను నార్కోటిక్ డ్రగ్స్ కిట్ల ద్వారా పరిశీలిస్తారన్నారు. గుర్తించిన బ్లాక్ స్పోర్ట్ ఏరియాల్లో తనిఖీ చేపట్టినప్పుడు వీటిని ఉపయోగించాలన్నారు. లాలాజలం, మూత్రం పరీక్షల ద్వారా డ్రగ్ టెస్టింగ్ చేస్తారని, పాజిటివ్ రిపోర్టు వస్తే వారిని అదుపులోకి తీసుకొని జైలుకు పంపుతామన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని ఎస్పీ సూచించారు. మాదకద్రవ్యాల విషయంలో ఎంత పెద్ద వారు ఉన్న ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ మధుసూదన్‌గౌడ్, కానిస్టేబుల్ నాగరాజు పాల్గొన్నారు.



డ్రగ్స్ కిట్

మూగ రోదన

సకాలంలో అందని పశు వైద్యం.. సిబ్బంది కొరతతో ఇబ్బందులు

పలుచోట్ల అద్దె భవనాల్లో సేవలు

గాలికుంటు నివారణ టీకాపై నిర్లక్ష్యం

కోహీర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మూగజీవాలకు సకాలంలో వైద్యసేవలు అందడం లేదు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పశు వైద్య కేంద్రాలు ఉన్నా సిబ్బంది సరిపడా లేరు. వివిధ కారణాలతో కిందిస్థాయి సిబ్బందే పశు వైద్యం అందించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. వాతావరణ పరిస్థితులతో వివిధ కాలాలలో పశువులకు రకరకాల వ్యాధులు వస్తుంటాయి. ఏడాది క్రితం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా చాలా మండలాలలో ఆవులకు ముద్ద చర్మపు వ్యాధి సోకగా పశువైద్యానికి పాడిరైతులు నానా అవస్థలు పడ్డారు.

101 పోస్టులకు 32 ఖాళీలు

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం 103 పశువైద్యశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాంతీయ పశు వైద్యశాలలు ఐదు, ప్రాథమిక పశు వైద్యశాలలు 44, పశు వైద్య ఉపకేంద్రాలు 53 ఉన్నాయి. వీటి పరిధిలో మూగజీవాలకు వివిధ రకాల సేవలు అందించాల్సి ఉండగా పశు వైద్య సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. ఉప కేంద్రాల పరిధిలో వీఏ నుంచి వీఎల్‌వో వరకు వివిధ స్థాయిల్లో విధులు నిర్వర్తిస్తుంటారు. మూడు రకాల పశు వైద్యశాలల్లో 101 మంది వరకు సిబ్బంది ఉండాలి. కానీ 69 మంది మాత్రమే ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 44 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 33 మంది మాత్రమే ఉన్నారు. 33 ప్రాథమిక ఉప కేంద్రాల్లో లైవ్ స్టాక్ సహాయకులు కూడా పూర్తి స్థాయిలో లేరు.



కోహీర్ పశువైద్య శాలలో గేదెకు వైద్య చికిత్స అందిస్తున్న వైద్యురాలు (ఫైల్)

క్షేత్రస్థాయిలో సేవలు అంతంత మాత్రమే

పశు వైద్య సిబ్బంది పశువులకు వైద్యం అందించటంతో పాటు టీకాల పంపిణీ, పశుసంపదపై రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. అత్యవసర సమయంలో రైతుల ఇంటి వద్దకు వెళ్లి పశు వైద్యం అందించాల్సి ఉంటుంది. అయితే, కొన్ని సందర్భాల్లో పశువైద్యాధికారులు స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్య సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు సేవలు అందించాల్సి ఉన్నప్పటికీ ఏ సమయంలో అందుబాటులో ఉంటారో పశుపోషకులకు తెలియడం లేదు. సిబ్బంది సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సీజన్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకాను అందించాల్సి ఉంది. ప్రభుత్వం చర్యలు

మిగతా 6వ పేజీలో



సంగారెడ్డి కలెక్టరేట్‌లో క్యూ పద్ధతిలో హాల్‌లోకి వెళ్లేందుకు కుర్చీలను ఏర్పాటు చేయించిన అధికారులు

సత్వరమే పరిష్కరించాలి

- అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్లు
- సంగారెడ్డి, మెదక్ కలెక్టరేట్లలో దరఖాస్తుల స్వీకరణ

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి, మెదక్ అదనపు కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ నగేష్, సంగారెడ్డి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల కోసం అధికారులు హాలు వద్ద కుర్చీలను ఏర్పాటు చేయించారు. గత సోమవారం ప్రజావాణి ఛాంబర్‌లోకి ఒక్కసారిగా రావడంతో కొంత మేరకు తోపులాట జరిగింది. ఇలాంటి ఘటనలు పునావృతం కాకుండా అర్జీదారులను క్యూలైన్‌లో ఒక్కొక్కరిని లోనికి పంపించారు. వివిధ సమస్యలపై 46 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మజారాణి, కలెక్టరేట్ ఏవో పరమేశం, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. మెదక్‌లో ప్రజావాణికి మొత్తం 59 దరఖాస్తులు రాగా.. ఇందులో అధికంగా ధరణి భూసమస్యలపై 20, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కావాలని 10, రైతు రుణమాఫీ కోసం 3, ఇతర సమస్యలపై 26 అర్జీలు అందాయి. డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. సంగారెడ్డి నారాయణరెడ్డి కాలనీకి చెందిన మాడపాటి తిరుపతి తాను పుట్టుకతో దివ్యాంగుడనని, సదరం క్యాంపులో సర్టిఫికెట్ ఇవ్వడం లేదని, పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నారు. కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో ఓ ఫంక్షన్‌హాల్ యజమాని రోడ్డుకి అడ్డుగా ప్రహరిని నిర్మిస్తున్నారని హైటెక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఫిర్యాదు చేశారు.

మిగతా 6వ పేజీలో

ఆందోళన వద్దు..
అందరి ధాన్యం కొనుగోలు చేస్తాం



అధికారులతో సమీక్షిస్తున్న హరిచందన

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి హరిచందన

నర్సాపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : వరి పంట వేసిన ప్రతీ రైతు వద్ద ధాన్యం కొనుగోలు చేయడానికే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, ఎవరూ ఆందోళన చెందవద్దని, ఒకటి రెండురోజుల్లో అంతా సర్దుకుంటుందని ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరిచందన పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో సంగారెడ్డి, మెదక్ అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, వ్యవసాయ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం 17శాతం కంటే తక్కువగా తేమ ఉండేలా ధాన్యంను ఆరబెట్టిన తర్వాత తీసుకువస్తే మేలు కల్గుతుందన్నారు. సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ కూడా ఇస్తుందని చెప్పారు. చెప్పారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు రైతుల ఇబ్బందులు లేకుండా చూస్తారన్నారు. ఒకటి రెండు రోజుల్లో రైసుమిల్లుల కేటాయింపు పూర్తవుతుందని హరిచందన తెలిపారు. కౌడిపల్లి మండలంలోని నాగ్సాన్‌పల్లిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి దాసరి హరిచందన ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులతో ముచ్చటించారు.



రోడ్డెక్కిన రైతులు

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి 15 రోజులు గడుస్తున్నా ఇంకా ధాన్యం ఎందుకు కొనుగోలు చేయడం లేదని చిన్న శంకరంపేట మండలంలో మెదక్ - చేగుంట రహదారిపై కొరివిపల్లి రైతులు ధాన్యం ఆరబోసి రాస్తారోకో నిర్వహించారు. - చిన్నశంకరంపేట, నవంబరు4 (ఆంధ్రజ్యోతి)

బొల్లారంలో ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

జిన్నారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రముఖ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. బొల్లారం సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా ఐనవోలు మండలంలోని గర్మిల్లపల్లి గ్రామానికి చెందిన బాలబోయిన వైష్ణవి(16) ఇక్కడి కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నది. సోమవారం సాయంత్రం 6.45 గంటల ప్రాంతంలో తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన కళాశాల సిబ్బంది స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. వైష్ణవి మృతికి సంబంధించి పూర్తి కారణాలు తెలియాల్సి ఉన్నది.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం చేసిన చిలుముల సుహాసినిరెడ్డి

మెదక్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మనిషికి విజ్ఞానంతో పాటు సంస్కారాన్ని అందించే గ్రంథాలయాలను దాతల సహకారంతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సోమవారం మెదక్‌లో నిర్వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా చిలుముల సుహాసినిరెడ్డి ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్టేట్ లైబ్రరీ చైర్మన్ రియాజ్ సుహాసినిరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో పుస్తకపఠనం ద్వారా అనేక మంది చైతన్యవంతులై పాలకులను ఎదురించారని గుర్తు చేశారు. యువత సెల్‌ఫోన్, సోషల్‌మీడియా మాధ్యమాలపైనే ఆసక్తి కనబరుస్తోందని ఆయన వాపోయారు. పుస్తకాలు చదవడం ద్వారా ప్రజల హక్కులు, బాధ్యతలు గుర్తెరగవచ్చునని, తద్వారా పాలకులు హక్కుల హననానికి పాల్పడకండా ఒత్తిడి తేవచ్చునని తెలిపారు. ఏ సమాజాల్లోనైనా వ్యవస్థలను శాసించేవారు పది శాతమే నని విశ్లేషించారు. స్వార్థ భావనలు విడనాడి సమాజ సర్వతో ముఖాభివృద్ధికి కృషిచేయాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. సీసీఆర్ ఫండ్‌తో పుస్తకాలు కొనుగోలు చేసి లైబ్రరీలలో పాఠకులకు అందుబాటులో ఉంచనున్నామన్నారు. గ్రంథాలయ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం పెరగడానికి విద్య ఎంతో దోహదం చేస్తుందన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తకాలు అధ్యాయనం చేసి కాంపిటేటివ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎంతో మంది ఉన్నారన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి నూతన చైర్‌పర్సన్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన సుహాసినిరెడ్డి సహాయ సహకారాలు తీసుకుంటానన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ ఆంజనేయులుగౌడ్, సుప్రభాతరావు, హఫీజ్ తదితరులు హాజరయ్యారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న సుహాసినిరెడ్డి



సుహాసినిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

రైతులను మోసం చేస్తారా?

- మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు

కౌడిపల్లి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : ఆదుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తారా అని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. కౌడిపల్లి మండలంలోని మహ్మద్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమ అనంతరం ఎంపీ రఘునందన్‌రావు విలేఖరులతో మాట్లాడుతూ ఎక్కడకు వెళ్లినా రోడ్ల వెంట ధాన్యం కనిపిస్తుందన్నారు. రాజధానిలో కూర్చొని ఉత్తర కుమార ప్రగల్భాలు మానుకోవాలని అన్నారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి అందరికీ చేయలేదని మండిపడ్డారు. జిల్లా మంత్రి జోక్యం చేసుకుని రైతులు అందరికీ రుణమాఫీ చేయాలని కోరారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి పదిహేను రోజులు గడుస్తున్నా ధాన్యం విక్రయం ప్రారంభించలేదన్నారు. పూర్తిగా టార్పాలిన్‌ల కిరాయిని భరించలేకపోతున్నారన్నారు. సన్నధాన్యం కొలతకు మిషన్‌లు ఏర్పాటు చేయడం రైతులను అవమానపరిచేలా ఉందన్నారు. మండలంలో రెండు సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుతో రవాణా ఖర్చులు భారంగా మారి నష్టపోతారని పేర్కొన్నారు.



ప్యాక్స్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్, మంత్రి దామోదర్, ఎమ్మెల్యే సునీతారెడ్డి

ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్ షురూ



గెలుపొందిన నిజామాబాద్ జట్టు

కొండాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండాపూర్ మండలం సీ.హెచ్.కోనాపూర్‌లో అండర్-23 ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ప్రారంభమైంది. స్థానిక ఎం.ఎ.క్రికెట్ గ్రౌండ్‌లో మెదక్ జిల్లా-నల్గొండ జిల్లా జట్లు తలపడగా, ఎస్‌వీఆర్ గగన్ క్రికెట్ గ్రౌండ్‌లో నిజామాబాద్ జిల్లా-కరీంనగర్ జిల్లా జట్లు మధ్య మ్యాచ్‌లు జరిగాయి. టాస్ గెలిచిన బ్యాటింగ్ చేసిన నల్గొండ జట్టు 44 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మెదక్ జిల్లా జట్టు 182 పరుగులకే ఆలౌట్‌కాగా, 25 పరుగులతో నల్గొండ జట్టు గెలుపొందింది. మరో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 39.2 ఓవర్లలో 168 పరుగులకే ఆలౌట్ అయింది. తర్వాత నిజామాబాద్ జట్టు 30.5 ఓవర్లలోనే 172 పరుగులు చేసి విజయం సాధించినట్లు మెదక్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు మర్రిముస్త్యాల యువతి



భవిష్యరెడ్డి

చేర్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన నక్కల భవిష్యరెడ్డి వాలీబాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఇటీవల అండర్-17విభాగంలో తమిళనాడు రాష్ట్రం కోటగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో నక్కల భవిష్యరెడ్డితో కూడిన తెలంగాణ జట్టు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ క్రమంలో ఈ నెల 6 నుంచి 10 తేదీ వరకు యూపీ రాష్ట్రంలోని బరేలీలో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొననుంది. ఈ మేరకు భవిష్యరెడ్డికి స్థానికులు అభినందనలు తెలిపారు.

ఒకప్పుడు పట్టుమని పదిమంది విద్యార్థులే ఉన్న ఆ పాఠశాల నేడు వందలమందితో కళకళలాడుతున్నది. నాడు శిథిలమైన తరగతి గదులు, అరకొర వసతులతో కొట్టుమిట్టాడిన ఆ బడి.. నేడు అధునాతన హంగులతో విద్యార్థులకు చదువుల ఒడిగా మారి అక్కున చేర్చుకుంటున్నది. జిల్లాలోనే మొట్టమొదటి ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక పాఠశాల కూడా ఇదే. ఇదంతా ఒక ఉపాధ్యాయుడి కృషితో దాతలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల సహకారంతోనే సాధ్యమైంది. అప్పట్లో ఆదరణకు నోచని.. నేడు అందరి మన్ననలు పొందుతున్న అంగడికిష్టాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలపై ప్రత్యేక కథనం



2012లో పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయుడు ఓంకార్



ప్రైవేటుకు దీటుగా విద్యార్థులకు యూనిఫాం, షూ, ఐడీ కార్డుతో ప్రస్తుత విద్యార్థులు

బడి.. బాగుపడింది..

మూతపడే దశ నుంచి.. మురిపించే స్థాయికి..

- పాఠశాల ఉపాధ్యాయుడు ఓంకార్ కృషి ఫలితం
- 2012లో పదిమందే విద్యార్థులు.. నేడు 212 మందితో కళకళ
- ఆంగ్ల మాధ్యమంలో బోధన, సకల సౌకర్యాలకు నిలయం
- ఆదర్శం అంగడికిష్టాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

మర్కుక్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇతర స్కూళ్లకు ఆదర్శంగా నిలుస్తున్నది. ఒకప్పుడు మాసిపోయిన గోడలు.. బడి ప్రాంగణమంతా కుక్కలు, పందుల సంచారం.. కేవలం పది మంది విద్యార్థులతో మూతపడే దశలో ఉన్న బడి.. ఓంకార్ అనే ఉపాధ్యాయుడి కృషితో ప్రస్తుతం దాని రూపురేఖలే మారిపోయాయి.

కారణాలు తెలుసుకుని..

2003 డీఎస్సీలో ఓంకార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికై ఉమ్మడి మెదక్ జిల్లా కల్హేర్ మండలం అంతర్గావ్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహించాడు. అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా 2009 ఆగస్టు 25న నేటి మర్కుక్ మండలం పాతూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మడేళ్లు పనిచేశాడు. అక్కడి నుంచి మళ్లీ సాధారణ బదిలీపై 2012లో అంగడికిష్టాపూర్ పాఠశాలకు వచ్చారు. బడి పరిసరాలు, విద్యార్థుల కొరత అతడిలో నిరాశను కలిగించింది. ఇక్కడ అప్పటికే విధులు నిర్వహిస్తున్న తోటి టీచర్ నుశ్రత్‌ను పాఠశాల దుస్థితికి గల కారణాలను అడిగి తెలుసుకున్న ఓంకార్ ఏదేమైనా పాఠశాల బాగుపరచాలని సంకల్పించుకున్నారు. అప్పటి నుంచి రెండేళ్ల పాటు అధ్యయనం చేసి విద్యార్థులు ఈ పాఠశాలకు రావడానికి ఆసక్తి చూపకపోవడానికి గల కారణాలను కనుగొన్నాడు. అందులో ప్రధాన కారణాలు ఆంగ్ల మాధ్యమ బోధన, వసతుల సరిగా లేకపోవడమేనని తెలుసుకున్నాడు. ఇక 2014 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా నాడు నూతనంగా ఎన్నికైన సర్పంచ్ దుద్దెడ రాములుగౌడ్, యువజన సంఘాల నాయకులు, గ్రామస్థుల సహకారంతో బడిని తీర్చిదిద్దాలన్న తన నిర్ణయాన్ని అందరిముందుంచాడు.



అంగడికిష్టాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

కార్పొరేట్ హంగులు..

మాటల్లో చెప్పి వదిలేయకుండా ఓంకార్ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. దాతలు, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, యువజన సంఘాల నాయకులు, తల్లిదండ్రుల సహకారంతో ఆంగ్ల మాధ్యమాన్ని అందుబాటులోకి తేవడంతోపాటు పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో అన్ని హంగులు సమకూర్చడంలో సఫలీకృతమయ్యాడు. దీంతో ఇది రాష్ట్రంలోనే ఉత్తమ ప్రభుత్వ పాఠశాలగా నిలిచింది. రానురాను బడిలో విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వచ్చి నేడు 212 మందికి చేరింది. 2015 సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో నాటి గడా అధికారి హన్మంతరావు ప్రత్యేక చొరవ తీసుకుని పాఠశాలకు మరో టీచర్ పోస్టును మంజూరు చేయించారు. ఆ పోస్టులో వచ్చిన ఉపాధ్యాయుడే రామకృష్ణారెడ్డి. చేబర్తి నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఓంకార్‌తో జతకట్టి పాఠశాలను ఉన్నత శిఖరాలకు చేర్చాడు. వారి పిల్లల్నీ ఇదే బడిలో చదివించి ఆదర్శంగా నిలిచాడు. కాగా, ఓంకార్ రెండు పర్యాయాలు ఉమ్మడి మెదక్ జిల్లా, ఒకసారి నూతన సిద్దిపేట జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారాలు అందుకున్నాడు.

పాఠశాల దత్తత తీసుకున్న అప్పటి సీపీ..

లా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్ చేయడం కోసం సిద్దిపేట జిల్లా మొట్టమొదటి పోలీస్ కమిషనర్ శివకుమార్ అప్పట్లో పల్లెనిద్ర నిర్వహించారు. అందులో భాగంగా అంగడికిష్టాపూర్ గ్రామానికి వచ్చిన ఆయనకు ఈ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో నచ్చాయి. దీంతో ఆయన పాఠశాల వివరాలను, స్థితిగతులపై ఆరా తీసి పాఠశాలతోపాటు గ్రామాన్ని దత్తత తీసుకుని అన్ని విధాలుగా తీర్చిదిద్దేందుకు తనవంతు సహకారం అందించారు. ప్రధానంగా నేరరహిత అంగడికిష్టాపూర్‌ను గ్రామంగా మార్చి జిల్లాలోని ఆదర్శంగా నిలిపారు.

ప్రముఖుల సందర్శన..

ఈ పాఠశాల గురించి తెలుసుకున్న పలువురు ప్రముఖులు సందర్శించి తమవంతు సహకారాన్ని అందిరచారు. నాటి గడా హన్మంతరావు చొరవతో స్థానిక సర్పంచ్ రాములుగౌడ్ ఆధ్వర్యంలో మొదటి పాఠశాల వార్షికోత్సవంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, తదుపరి వార్షికోత్సవంలో నాటి కలెక్టర్ వెంకట్రాంరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అప్పుడు ఇక్కడి విద్యార్థుల ప్రతిభకు ఆకర్షితుడై ఏకంగా రూ.10 లక్షలను పాఠశాల అభివృద్ధికి, మరో 10 లక్షలను గ్రామపంచాయతీ అభివృద్ధికి అందించారు. అంతేకాకుండా పాఠశాల అదనపు తరగతి గదులు, గ్రామంలో యువజన సంఘం భవనం, లైబ్రరీ, మహిళా భవనాలను కూడా మంజూరు చేశాంనను. అనంతరం ప్రశాంత్ జీవన్ పాటిల్ ఐఏఎస్, నాటి ట్రైనింగ్ ఐఏఎస్ ముజామిల్‌ఖాన్, సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గారిమా అగర్వాల్, పాఠశాలనపపు సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.

తేమ నెపంతో రైతులను వేధించొద్దు

- దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

తొగుట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తేమశాతం నెపంతో కొనుగోలు కేంద్రాల వద్ద పత్తి రైతులను వేధిస్తే ఊరుకునేదిలేదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అధికారులను హెచ్చరించారు. సోమవారం సాయంత్రం తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని వెంకటేశ్వర కాటన్ ఇండస్ట్రీలో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులవైపు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతులకు న్యాయం చేయడం కోసమే కేంద్ర ప్రభుత్వం పత్తికి క్వింటాలుకు రూ.7,512 మద్దతు ధర నిర్ణయించిందన్నారు. రైతులు పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 లోపు ఉండేలా చూసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ ఉపసంయుక్త సంచాలకుడు ప్రసాద్‌రావు, సీసీఐ సెంటర్ ఇన్‌చార్జి సాయిచంద్, మార్కెట్ కమిటీ కార్యదర్శి స్వామి, పరమేశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు చంద్రం, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్‌గౌడ్, నర్సింహులు, స్వామిరెడ్డి, కళ్యాణ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగిన యువకుడు

- చికిత్సపొందుతూ మృతి



స్వామి(ఫైల్)

సిద్దిపేట రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో యువకుడు గడ్డిమందు తాగగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణరావుపేట మండలం మాటిండ్ల గ్రామానికి చెందిన పొన్నాల స్వామి (22) వృత్తి రీత్యా డ్రైవర్. పలుచోట్ల అప్పు చేసి ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. వీటి ఎలా తీర్చాలంటూ నిత్యం ఇంట్లో చెబుతూ దిగాలుపడేవాడు. ఈ క్రమంలో అక్టోబరు 31న రాత్రి గడ్డి మందు ఇంటికి తెచ్చుకుని తాగాడు. గమనించిన తండ్రి రాములు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుని అన్న పొన్నాల బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నకోడూరు పోలీసులు తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్మికుడు ఆత్మహత్య



మనోహర్ మృతదేహం

మాసాయిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలం స్టేషన్ మాసాయిపేట గ్రామ పంచాయతీ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామ పంచాయతీలో పనిచేసే మండే మనోహర్(60) కుమారుడు ఇటీవల మరణించాడు. దీన్ని జీర్ణించుకోలేని మనోహర్ జీవితంపై విరక్తి కలిగి ఆదివారం రాత్రి స్టేషన్ మాసాయిపేట వద్ద గల ఫంక్షన్ హాల్ వద్ద ఇనుప రాడ్డుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి




రమేష్(ఫైల్)

నర్సాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన రోటిమ్ రమేష్(28) కులవృత్తిలో భాగంగా సోమవారం ఉదయం గ్రామ చెరువులోకి చేపలవేటకు వెళ్లాడు. ఈ క్రమంలో అతడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

రూ.30 వేల జీతమంటూ మోసం

- రూ. 6వేలు కాజేసిన కేటుగాళ్లు



నట్‌రాజ్ కంపెనీ లిమిటెడ్‌లో జాయిన్ అయినట్లు పంపించిన గేట్ పాస్

మద్దూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లు జాబ్ ఆశ చూపి యువకుడి నుంచి డబ్బులు కాజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మద్దూరు మండలం ధర్మారం పిట్టలకాలనీవాసి కాలియా సతీష్ ఫోన్‌లోని వాట్సా‌ప్‌కు ఆదివారం హిందుస్థాన్ పెన్సిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చిరునామాతో ఆల్ ఇండియా ఫ్యాక్టరీ పేర పెన్సిల్ ప్యాకింగ్ జాబ్, నెలకు రూ.30వేల జీతమంటూ మెసేజ్ వచ్చింది. దీంతో అతడు అందులోని నంబరుకు ఫోన్ చేయగా.. ఒక్కో ప్యాకెట్‌కు 10 పెన్సిళ్ల చొప్పున రోజుకు 100 ప్యాకెట్లు చేస్తే.. రూ.వెయ్యి లభిస్తుందని చెప్పడంతో చేరేందుకు ఒప్పుకున్నాడు. జాయినింగ్ కోసం ఆధార్‌కార్డు, ఒక పాస్ ఫొటో, ప్రస్తుత చిరునామాతో రిజిస్ట్రేషన్‌కై తాము పంపించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి రూ.650 చెల్లించాలని చెప్పడంతో అలాగే చేశారు. అనంతరం వారు ఐడీ కార్డు (గేట్ పాస్) తయారు చేసి పంపించడంతో సతీష్ నిజమేనని నమ్మాడు. అప్పటి నుంచి పలు దఫాలుగా వేర్వేరు కారణాలు చెప్పి రూ.6వేల వరకు లాగారు. జీఎస్టీ పేరుతో మరోసారి డబ్బులు పంపించాలని మెసేజ్ రావడంతో మోసపోయానని గుర్తించిన సతీశ్ సోమవారం మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కమర్షియల్ పైలెట్‌గా యశస్విని



పైలెట్‌గా ఎంపికైన యశస్విని

గజ్వేల్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో కమర్షియల్ పైలెట్‌గా ఎంపికైన యువతి అందరి మన్ననలు అందుకుంటుంది. గజ్వేల్ మండలం దాచారం గ్రామానికి చెందిన వేముల మురళి, వసుందర దంపతులకు కొడుకు, కూతురు యశస్విని ఉన్నారు. రామాయణపేటలోని మురళి ఎస్‌బీలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా, కామారెడ్డి జిల్లాలో వసుందర ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. వీరి కూతురు యశస్విని మహారాష్ట్రంలోని పూణేలో పైలెట్‌గా శిక్షణ పొంది. ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో అన్ని దశల ఇంటర్వ్యూలను దాటుకొని కమర్షియల్ పైలెట్‌గా ఉద్యోగం సాధించింది. యశస్విని గ్రామస్థులు అభినందిస్తున్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

స్విమ్మింగ్‌లో విద్యార్థి ప్రతిభ

- అభినందించిన అదనపు కలెక్టర్

సంగారెడ్డి అర్బన్/సంగారెడ్డి రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణానికి చెందిన శ్లోకాస్ శ్రీవాణి హైస్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి మహ్మద్ అబ్దుల్ రహమాన్‌సిద్ధిఖ్ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో మూడవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ఆ విద్యార్థిని అభినందించి జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. టీఎస్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్‌అలీ మాట్లాడుతూ స్విమ్మింగ్‌లో విద్యార్థి ప్రతిభ కనబర్చడం జిల్లాకే గర్వకారణమన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా విద్యార్థికి నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో పద్మజా, డీవైఎస్‌వో ఖాసీంబేగ్, టీఎన్‌జీవో కార్యదర్శి వి.రవి, ప్రిన్సిపాల్ హసన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీకాంత్, వెంకటరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మృతిచెందిన చిన్నారులకు తోటి విద్యార్థుల నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు

మనోహరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండలం పోతారం గ్రామంలో మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఇద్దరు చిన్నారులు సహస్ర, సాన్విలకు తోటి విద్యార్థులు నివాళులర్పించారు. సోమవారం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ 2 నిమిషాలు మౌనం పాటించారు. కొవ్వొత్తులు వెలిగించి చిన్నారులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు మాధవి, శర్మిల, రాజేశ్వర్‌రెడ్డి, అంగన్వాడీ టీచర్ తులసి, ఏఎన్‌ఎం జానబాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజాపాలన పుస్తక సంకలనంలో

'పిన్నింటి' రచనలు



పుస్తకంతో పిన్నింటి రత్నం

చేర్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఇటీవల 80 పాటల సంకలన పుస్తకం రూపొందించబడింది. రాష్ట్రవ్యాప్తంగా పలువురు కవులు రచనలందించగా, కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన పిన్నింటి రత్నం జానపద శైలిలలో రచించిన రెండు పాటలను సంకలనంలో ముద్రించారు. ఈ మేరకు ఆయనను స్థానికులు, కవులు, సాహితీవేత్తలు అభినందించారు.



నర్సాపూర్ ప్రధాన చౌరస్తా వద్ద వాహనదారులకు అడ్డంకిగా మారిన తోపుడు బండ్ల వ్యాపారం

- దుకాణదారుల సామగ్రితో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- ప్రధాన రోడ్డుపై అడ్డంగా తోపుడుబండ్ల వ్యాపారాలు
- ఫుట్‌పాత్ స్థలానికి అద్దె వసూలు ఆరోపణలు
- పాదచారులకు, వాహనదారులకు అడుగడుగునా ఆటంకాలే
- పట్టించుకోని పోలీసులు, మున్సిపల్ సిబ్బంది

నర్సాపూర్‌లో ట్రాఫిక్ ఇక్కట్లు

నర్సాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలో జాతీయ రహదారిపై ప్రత్యేకంగా ఫుట్‌పాత్ ఉన్నా పాదచారులకు నడిచే అవకాశం లేదు. అదేవిధంగా వాహనాలను పార్కింగ్ చేసే స్థలంలో వాహనాలు నిలిపేందుకు స్థలం ఉండదు. స్థానికంగా తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదురవుతున్నా ఓ వైపు పోలీసులు కాని, మరోవైపు మున్సిపల్ అధికారులు కానీ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై నర్సాపూర్ పట్టణ పరిధిలో పాదచారుల కోసం ఫుట్‌పాత్ ఏర్పాటు చేయడంతో పాటు వాహనాల పార్కింగ్ కోసం కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అయితే స్థానిక వ్యాపారులు చాలామంది తమ సామగ్రితో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి పాదచారులకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారు. మరికొందరు ఏకంగా ఫుట్‌పాత్‌ను సైతం టీ పాయింట్లకు, ఇతర మిర్చి, చాట్‌బండార్‌లు తదితర వ్యాపారులకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. కాగా పలు దుకాణదారులు తమ దుకాణం ముందున్న ఫుట్‌పాత్‌పై స్థలాన్ని చిరువ్యాపారులకు అద్దెకిచ్చి రోజుకు రూ.300 నుంచి రూ.500 అద్దె వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో పట్టణంలో ఫుట్‌పాత్ ఉన్నా నడవలేని దుస్థితి నెలకొన్నది. నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లో ప్రధాన రహదారులపై ఇంత తతంగం జరుగుతున్నా అధికారులకు ప్రజల సమస్యలు పట్టవా అని స్థానికులు మండిపడుతున్నారు.

రోడ్డుపైనే తోపుడు బండ్లు

ఇక ట్రాఫిక్ సిగ్నల్ పడే చౌరస్తా సమీపంలో ఏకంగా జాతీయరహదారిపైనే తోపుడుబండ్లు పెట్టి వ్యాపారాలు సాగిస్తుండటంతో అక్కడ సిగ్నల్ పడే సమయంలో వాహనదారుల పాట్లు అంతా ఇంతా కాదు. ఫుట్‌పాత్ ఆక్రమణల కారణంగా గత్యంతరం లేని పరిస్థితుల్లో పాదచారులు రోడ్డుపైనే నడిచివెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసి రోడ్డుపై వాహనదారులకు ఇక్కట్లు రాకుండా చూడటంతో పాటు ఫుట్‌పాత్‌పై అడ్డగోలుగా సామగ్రి పెట్టుకుంటున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పాదచారులకు అడ్డంకిగా ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు

నర్సాపూర్‌లో త్వరలో ఐసీయూ, ఎన్‌డీసీ సేవలు

ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ప్రారంభించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



నర్సాపూర్ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్

నర్సాపూర్,నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లో త్వరలో ఐసీయూ, ఎన్‌డీసీ వైద్య సేవలను అందుబాటులోకి తేనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిలో రూ.50లక్షల వ్యయంతో ఐదు పడకల సామర్థ్యం గల డయాలసిస్ కేంద్రాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహా, స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో డయాలసిస్‌తో బాధపడుతున్న వారికి ఇక నుంచి ఇక్కడే ఆసుపత్రిలో అందుబాటులోకి రావడంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ప్రస్తుతం మెదక్ జిల్లా ఆసుపత్రిలో వందమంది వరకు డయాలసిస్ రోగులు చికిత్స పొందుతున్నారని అందులో 22 మంది నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన వారే ఉన్నారని చెప్పారు. నర్సాపూర్ ప్రాంతానికి త్వరలో ఐసీయూ, ఎన్‌డీసీ ట్రామా అత్యవసర సేవలను ఏర్పాటు చేస్తామని తద్వారా ప్రధాన రోడ్లపై ప్రమాదాలు జరిగిన వెంటనే అధునాతన వైద్యం సత్వరమే అందించే వీలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రాజిరెడ్డి, వైస్‌చైర్మన్ నయీమొద్దీన్‌తో పాటు అధికారులు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. డీఎస్పీ వెంకట్రామ్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంత్రి దృష్టికి 'ఆంధ్రజ్యోతి' కథనం

ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు, పట్టణం నిలిచిపోయిన అభివృద్ధి ప్రత్యేక నిధులకు సంబంధించి సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మంత్రి దామోదర్‌రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి పట్టణంలో నిలిచిపోయిన ప్రత్యేక నిధులు వచ్చేలా హామీ ఇవ్వడంతో చైర్మన్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

మీటింగ్ సాకుతో 12గంటలకే బడి బంద్

కోహీర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని కవేలి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు సోమవారం 12గంటలకే ఇంటికి పంపించేశారు. పిల్లలు ఇంటికి వెళ్తున్న క్రమంలో వారిని ప్రశ్నించగా మా సార్లకు మండల ఆఫీసులో ఏమో... మీటింగ్ ఉందని అందరినీ ఇంటికి పొమ్మన్నారని సమాధానం ఇచ్చారు. ఈ విషయమై ఎంఈవో జాకీర్ హుస్సేన్‌ను వివరణ కోరగా సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి మధ్యాహ్నం 2గంటలకు కోహీర్ ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఉందని అందుకే ముందస్తుగా పిల్లలను వదిలేసి ఉంటారని సమాధానం ఇచ్చారు. మీటింగ్‌కు రెండు గంటల ముందే పిల్లలను వదిలేయడం సరికాదని మరో మారు ఇలా జరగకుండా చూస్తామని సమాధానం ఇచ్చారు.

7 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

మెదక్ అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 7 నుంచి 28వ తేదీ వరకు చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. సోమవారం సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఈవో మాట్లాడుతూ.. జిల్లాలోని 8, 9, 10 వ తరగతి విద్యార్థులకు ఈనెల 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లాస్థాయి సంబరాలుంటాయన్నారు.

నేడు కేవీకేలో జాతీయ చిరుధాన్యాల సదస్సు

జహీరాబాద్, నవంబరు 4: మండలంలోని అల్లో ల్-దిడిగి గ్రామాల శివారులో ఏర్పాటు చేసిన డీడీఎస్-కేవీకేలో ఈ నెల 5, 6 తేదీల్లో జాతీయ చిరుధాన్యాల సదస్సును నిర్వహించనున్నట్లు డీడీఎస్ చిరుధాన్యాల సమాఖ్య సభ్యులు తెలిపారు.


'వెల్‌నెస్' ఆధ్వర్యంలో ఉచిత మెగాహెల్త్ క్యాంపు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి చౌరస్తాలోని శ్రీచైతన్య టెక్నోహైస్కూల్‌లో వెల్‌నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగాహెల్త్ క్యాంప్‌ను సోమవారం నిర్వహించారు. సుమారు 250 మందికి పైగా విద్యార్థులు, పాఠశాల సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో డా.అమీన్, పాఠశాల ప్రిన్సిపాల్ మల్లేశం ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



మెగాహెల్త్ క్యాంపులో వెల్‌నెస్ ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది

రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



నిజాంపేట: నార్లాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



నాగల్‌గిద్ద: పూసల్‌పాడ్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నిజాంపేట/చేగుంట/వట్‌పల్లి/ టేక్మాల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. నిజాంపేట మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంతో పాటు నార్సింగి మండలంలోని సంకాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు అధైర్యపడొద్దని, పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. వట్‌పల్లి మండల పరిధిలోని బిజిలీపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. మెదక్‌జిల్లాలోని టేక్మాల్ మండల కేంద్రంతో పాటు దన్నూర, ఎల్లంపల్లి, గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను టేక్మాల్ సీఈవో శివకుమార్ సోమవారం ప్రారంభించారు.

● నాగల్‌గిద్ద, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారంమండల పరిధిలోని పూసల్‌పాడ్ శివారులో సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అధికారులు

హత్నూర/ కల్హేర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హత్నూరలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం జిల్లా అదన కలెక్టర్ మాధురి పరిశీలించారు. అక్కడ రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంట జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న, డీఆర్డీవో జ్యోతి, డీపీఎం కొండలరావు తదితరులు ఉన్నారు. కల్హేర్ మండల పరిధిలోని మహాదేవ్‌పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి సోమవారం పరిశీలించారు. ఆయన వెంట కల్హేర్ తహసీల్దార్ శివ శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

మూగ రోదన..

(3వ పేజీ తరువాయి)

చేపట్టినప్పటికీ జిల్లాలో సిబ్బంది లేమీ, పశువైద్యాధికారుల నిర్లక్ష్యంతో నత్తనడకన కొనసాగుతున్నది.

సొంత భవనాలు లేక ఇబ్బందులే

జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో పశువైద్యశాలలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సొంత భవనాలు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కాలం చెల్లిన భవనాల్లో బిక్కుబిక్కుమంటూ సిబ్బంది సేవలు అందించాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి సొంత భవనాలు నిర్మించి పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమిస్తే మూగజీవాలకు ఎంతో వెసులుబాటు ఉంటుంది.

పశుసంపద పెరగాలంటే వైద్య సేవలందాలి

- నర్సిములు, రైతు, బడంపేట

గ్రామస్థాయిలో పశుసంపద పెరగాలంటే పశు వైద్య సేవలు ఎంతో అవసరం. పశువులు రోగాల బారిన పడినప్పుడు సకాలంలో వైద్య సేవలు అందితేనే పశు సంపద పెరుగుతుంది. పశువులు వివిధ సీజనల్ రోగాలకు గురైనప్పుడు వైద్య సేవలు అందకపోవడంతో మృత్యువాత పడుతున్నాయి. ప్రభుత్వం పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి అన్ని రకాల మందులు అందుబాటులో తెస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రభుత్వానికి నివేదించాం

- వసంతకుమారి, సంగారెడ్డి జిల్లా పశువైద్యాధికారి

జిల్లాలో ఖాళీగా ఉన్న పశు వైద్య సిబ్బంది నియామకం కోసం ఖాళీల వివరాలను ప్రభుత్వానికి పంపించాం. ఏ ఏ ప్రాంతంలో పశువైద్యశాలలకు సొంత భవనాలు లేవో వివరాలను నివేదించాం. ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేసి, భవనాలను నిర్మించాల్సి ఉంది.

సత్వరమే పరిష్కరించాలి..

(3వ పేజీ తరువాయి)

మునిపల్లి మండలంలోని చీలపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని టేకు, ఇతర చెట్లను అక్రమంగా నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల నాయకుడు రమేష్ గౌడ్, బీఆర్‌ఎస్ మండల నాయకుడు నగేష్ వినతిపత్రం అందజేశారు. పత్తి పంట కొనుగోలును వేగవంతం చేసి, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) జిల్లా అధ్యక్షుడు పి.నరసింహారెడ్డి నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల-పల్సానూర్ గ్రామాల శివారుల్లోని రైతులకు ఉపయోగపడే శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని కాపాడాలని కోరుతూ మాజీ సర్పంచ్ బంటు శ్రీనివాస్ దరఖాస్తు అందజేశారు.

నా కొడుకు నుంచి రక్షించండి



గోడు వెళ్లబోసుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన పోచమ్మ

తన కొడుకు నుంచి రక్షించాలని వృద్ధురాలైన తల్లి సంగారెడ్డి అదనపు కలెక్టర్‌కు ప్రజావాణిలో మొర పెట్టుకున్నది. వివరాల్లోకి వెళితే.. గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కొక్కండ పోచమ్మ భర్త 11 ఏళ్ల క్రితం మృతిచెందాడు. వీరికి ముగ్గురు కుమారులు సత్తయ్య, చంద్రయ్య, దశరథ్. రెండో కుమారుడు చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి పెద్ద కుమారుడు సత్తయ్య వద్దె ఉంటూ పోచమ్మ జీవనం సాగిస్తున్నది. పెద్ద కుమారుడు సత్తయ్య కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సత్తయ్య లేని సమయంలో చిన్నకుమారుడు దశరథ్ తల్లివద్దకు వచ్చి దౌర్జన్యంగా దాడి చేసి పింఛన్‌తో పాటు బంగారు ఆభరణాలు, భూమిపై వచ్చిన సాగు రుణం రూ.1.05 లక్షల నగదును తీసుకువెళ్లాడని, తన కుమారుడి నుంచి రక్షించి తనకు న్యాయం చేయాలని వృద్ధురాలు అధికారుల కాళ్లవేళ్లా పడడం చూపరులను కలిచివేసింది. సమస్యను తెలుసుకున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సమస్యను పరిష్కరించాలని ఆర్డీవో రవీందర్‌రెడ్డిని ఆదేశించారు.

కుటుంబ గొడవలతో వ్యక్తి అదృశ్యం

శివ్వంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడిన వ్యక్తి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన బక్కోళ్ల హరీశ్(28) సికింద్రాబాద్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 13న ఇంట్లో డబ్బుల విషయంలో భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులుఎంత గాలించినా ఫలితం లేకపోయింది. భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అద్దెబస్సు తీసుకునేవారికి చార్జీల తగ్గింపు

● జహీరాబాద్ డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్



జాకీర్ హుస్సేన్, డిపో మేనేజర్

జహీరాబాద్, నవంబరు 4: ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన బస్సులను తీసుకున్నవారికి చార్జీలను తగ్గించనున్నట్లు జహీరాబాద్ డిపోమేనేజరు జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పెళ్లిలు, శుభకార్యాలకు, విహారయాత్రకు బస్సులను తీసుకువెళ్లేవారికి చార్జీల తగ్గింపు వర్తిస్తుందన్నారు. పల్లెవెలుగు బస్సుపై కిలోమీటరుకు రూ.11, ఎక్స్‌ప్రెస్‌కు రూ.7, డీలక్స్ బస్సులపై రూ.8, సూపర్ లగ్జరీ బస్సులకు రూ.6చొప్పున తగ్గించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9494093486, 984988912 నెంబరుకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఏఐసీటీఈ ఆధ్వర్యంలో బీవీఆర్‌ఐటీలో శిక్షణ

నర్సాపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రాంలో భాగంగా వారం రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పిలాని డీన్ జీవన్‌జైడి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటేషన్‌లో ఫ్లూయిడ్ డైనమిక్స్ బేసిక్స్ అండ్ ఇండస్ట్రియల్ అప్లికేషన్స్ అంశం అనేక రంగాలలో విస్తృతంగా ఉపయోగిస్తున్నందున మెకానికల్, కెమికల్, ఫార్మ విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. వారం రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎన్నికల విధుల డబ్బులు చెల్లించాలి



ఖేడ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నారాయణఖేడ్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఎల్‌వోలుగా విధులు నిర్వర్తించిన తమకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఖేడ్ తహసీల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలోఅంగన్‌వాడీ టీచర్లు ధర్నానిర్వహించారు. 10 నెలలుదాటినా డబ్బులు చెల్లించక పోవడం దారుణమన్నారు. అనంతరం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, అంగన్‌వాడీ టీచర్ల సంఘం అధ్యక్షురాలు నాగేశ్వరి, ఇతర బాధ్యుల పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టులు



జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచులు

న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సర్పంచుల జేఏసీ పిలుపు మేరకు పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ చలోహైదరాబాద్ పేరిట సంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి సోమవారం పోరుబాటకు తరలుతున్న మాజీ సర్పంచులను పోలీసులు ఎక్కడి వారిని అక్కడే అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాగా పలు చోట్ల సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, మొగుడంపల్లి మండలాలకు చెందిన సర్పంచులను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి జహీరాబాద్, జహీరాబాద్‌రూరల్, చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. కోహీర్ మండలంలోని మాజీ సర్పంచులను కోహీర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాగల్‌గిద్ద మండలంలోని ఐదుగురు మాజీ సర్పంచులను అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హత్నూరలో నాగులదేవులపల్లి మాజీ సర్పంచ్ బావికాడి సుధాకర్, సిరిపురం మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్, నవీన్‌గౌడ్, రాంరెడ్డి తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. నారాయణఖేడ్ మండల మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జగన్‌చారితో పాటు పలువురు మాజీ సర్పంచులు, కల్హేర్ మండల మాజీ సర్పంచులను పోలీసులు అరెస్టు చేశారు. అదేవిధంగా మెదక్ జిల్లాలోని శివ్వంపేట మండలంలో ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తుగా మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయినవారిలో మాజీ సర్పంచులు తలారి శివులు, సోమ అశోక్,పార్వతి సత్యం ఉన్నారు. పాపన్నపేట మండలంలో మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్, మల్లేశం తదితరులను పోలీసులు అరెస్టుచేశారు. వెల్దుర్తి మండలంలో అరెస్టయినవారిలో మాజీ సర్పంచ్‌లు శంకర్‌రెడ్డి, మల్లేశంగౌడ్ ఉన్నారు. కాగా మాజీ సర్పంచులను అరెస్టు చేయడం దుర్మార్గమని దీన్ని తాము ఖండిస్తున్నామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

నారాయణఖేడ్,నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్లసంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లోని 79 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 16 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

డ్రగ్స్, మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

మనోహరాబాద్, నవంబరు (ఆంధజ్యోతి)4: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ మాదక ద్రవ్యాలపై ఉపాధ్యాయులు అవగాహన సదస్సు నిర్వహించారు. మనోహరాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్, మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు సీనియర్ అసిస్టెంట్ సైన్స్ ఉపాధ్యాయుడు మల్లేశం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రెహానా సుల్తాన, ఏఎస్‌ఐ నరసింహ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేకు అన్ని రకాల ఉపాధ్యాయులను కేటాయించాలి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కులగణనకు అన్ని రకాల ఉపాధ్యాయులను కేటాయించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌సాబేర్‌అలీ కోరారు. సంగారెడ్డిలోని స్థానిక ఎస్టీయూ భవన్‌లో సోమవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేకు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు, వికలాంగులు, పిల్లల తల్లులను మినహాయింపు ఇవ్వాలన్నారు.

కుటుంబ సర్వేపై ఎన్యూమరేటర్లకు శిక్షణ

జహీరాబాద్/కోహీర్/రామచంద్రాపురం/మునిపల్లి/కల్హేర్/నాగల్‌గిద్ద/తూప్రాన్/చిన్నశంకరంపేట/చిలప్‌చెడ్, నవంబరు 4: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు సోమవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా మండలాల్లో ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలవారిగ చేపట్టే సమగ్ర కుటుంబసర్వేను పకడ్బందీగ చేపట్టాలని వ్యవసాయశాఖ ఏడీఏ, మండల ప్రత్యేక అధికారి బిక్షపతి, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయులకు(ఎన్యూమరేటర్లు), సూపర్‌వైజర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా కోహీర్ ఎంపీడీవో కార్యాలయం ఎంపీడీవో భారతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సంగారెడ్డి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మునిపల్లి మోడల్ స్కూల్‌లో అధికారులు ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సిర్గాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. మెదక్ జిల్లా తూప్రాన్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శేషాద్రి ఆధ్వర్యంలో, మున్సిపాలిటీలో తహసీల్దారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్లకు కుటుంబ సర్వే గణనపై అవగాహన కల్పించారు. చిన్నశంకరంటపేట, చిలప్‌చెడ్ లోని రైతు వేదికల్లో శిక్షణ కార్యక్రమాలను చేపట్టారు.

రాష్ట్రస్థాయి యోగాకు గంగారం విద్యార్థులు

కొండాపూర్,నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పండరి నాయక్ సోమవారం తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్జీఎఫ్ యోగా పోటీలు శనివారం సిద్దిపేటలో జరిగాయి. ఎస్జీఎఫ్ (అండర్17)లో సుమతి, లక్ష్మీ, వర్షిత,(అండర్14)లో పవిత్ర, ప్రవళిక పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వరంగల్‌లో ఈనెల 8,9,10వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు ఎంపికైన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

రాయికోడ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసే సీసీఐ కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతీ అధికారికి ఉందని రాయికోడ్, మునిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయికోడ్‌లోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో మండలంలోని మునిపల్లి, రాయికోడ్‌మండలాలకు సంబంధించిన అగ్రికల్చర్ మార్కెటింగ్ సీసీఐ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, సీసీఐ అధికారులు మార్కెటింగ్ అధికారులు, అగ్రికల్చర్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రామచంద్రాపురం, నవంబరు 4: మండల పరిధిలోని తెల్లాపూర్ మున్సిపాలిటీ ఉస్మాన్‌నగరంలో 8 ఎంవీఏ పీటీఆర్ అమర్చడం, ఇతర మరమ్మతుల దృష్ట్యా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శివశంకర్ తెలిపారు. ఇందులో భాగంగా ఉస్మాన్‌నగర్, తెల్లాపూర్ గ్రామం, ఎన్‌సీసీ, ఆనంద్ హోమ్స్, రాధే, సీఎంజీ, సురభీ, ముప్ప, నెవీ, మైహోం, బీహెచ్ఈఎల్ సొసైటీ, ఆకృతి, ఎలియన్స్ మెజిస్టిక్ మిడో తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

నూతన వేతన ఒప్పందం అమలుపై కార్మికుల హర్షం

జిన్నారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో నూతన వేతన ఒప్పందం అమలుకు కృషి చేసిన యూనియన్ నాయకులను కార్మికులు సన్మానించారు. సోమవారం బొల్లారంలో వింధ్య ఆర్గానిక్స్ పరిశ్రమ కార్మికులు, యూనియన్ నాయకులు వరప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డిలను కలిసి సన్మానించారు. ఇటీవల పరిశ్రమలో నూతనంగా రూ.10,100 రూపాయల వేతన ఒప్పందం అమలు చేయించిన యూనియన్ నాయకులు వరప్రసాద్‌రెడ్డి, ఇతర నాయకులకు కార్మికులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు భూగర్భ జల పరిరక్షణపై అవగాహన

సంగారెడ్డి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం భూగర్భ జలశాఖ అధ్వర్యంలో విద్యార్థులకు భూగర్భ జల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భూగర్భ జలశాఖ హైడ్రాలజిస్ట్ డా. సంతోష్, సూపరింటెండెంట్ డా. అనిల్‌కుమార్, ఎంఈవో విద్యాసాగర్, ప్రధానోపాధ్యాయుడు వహీద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మహిళా కన్వీనర్ల నియామకం

జహీరాబాద్, నవంబరు 4: జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు ఎస్టీయూ మహిళా కన్వీనర్ల నియామకం చేపట్టడమైందని ఎస్‌జీటీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధానకార్యదర్శి కిష్టయ్య తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మహిళా ఎస్టీయూ ఉపాధ్యాయులను బలోపేతం చేయడానికే మహిళా విభాగం కన్వీనర్లను నియమించడమైందన్నారు. జహీరాబాద్ మండల మహిళావిభాగం కన్వీనర్‌గా వినయపాటిల్, జహీరాబాద్ పట్టణ కన్వీనర్‌గా జ్యోతి, మొగుడంపల్లి మండల కన్వీనర్‌గా సురేఖ, న్యాల్‌కల్ మండల కన్వీనర్‌గా అనిత, ఝరాసంగం మండల కన్వీనర్‌గా సుకన్యను నియమించినట్టు తెలిపారు.